# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

శనివారం 15-06-2024 4 PM





## రైతులకు గుడ్‌న్యూస్

### 18న పీఎం కిసాన్ నిధులు విడుదల

**ఢిల్లీ, జూన్ 15 (ప్రజాస్వరం):** రైతులకు గుడ్‌న్యూస్.. త్వరలోనే రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమకానున్నాయి. ప్రధాని మంత్రిగా మూడోసారి [illegible] స్వీకరించాక తొలిసారి నరేంద్ర మోదీ తన సొంత నియోజకవర్గం వారణాసిలో ఈనెల 18న పర్యటించబోతున్నారు. ఈ పర్యటనలో భాగంగా అదే రోజు దేశవ్యాప్తంగా ఉన్న 9.26 కోట్ల మంది లబ్ధిదారులకు పీఎం కిసాన్ నిధులు జమ చేయబోతున్నారు. ఈ పథకం కింద 17వ విడతలో 20వేల కోట్లకు పైగా నిధులు విడుదలకానున్నాయి.





# ఏజెన్సీలో టెన్షన్..టెన్షన్

## అడవిలో అడుగుకో మందుపాతర !

- పోలీసులే లక్ష్యంగా మావోయిస్టుల స్కెచ్
- భద్రతా బలగాలను హతమార్చేందుకు భారీ ప్లాన్
- ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లో బూబీట్రాప్స్, ల్యాండ్‌మైన్స్..
- మావోల మందుపాతరకు యువకుడు బలి
- మరో ఘనటలో మహిళకు తీవ్రగాయాలు
- భయాందోళనలో ఏజెన్సీ గ్రామాల ప్రజలు
- పోలీసులు - మావోయిస్టుల మధ్య
- ఆధిపత్య పోరులో నలిగిపోతున్న సామాన్యులు

**వరంగల్, జూన్ 15 (ప్రజాస్వరం):** తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ములుగు జిల్లా ఏజెన్సీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఓవైపు ప్రతీకారం కోసం మాటువేసి ఉన్న మావోయిస్టులు, మరోవైపు అణువణువూ అడవిని జల్లెడపడుతున్న పోలీసులు వెరసి బార్డర్‌లో యుద్ధవాతావరణం నెలకొంది. పోలీసులు కొత్త టెక్నాలజీతో ముందుకు పోతుంటే, మావోయిస్టులు ధీటుగా బదులిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నక్సలైట్ల ఏరివేత పేరుతో అడవుల్లో బలగాలు మోహరిస్తుంటే దానికి కౌంటర్‌గా పోలీసులే లక్ష్యంగా బూబీట్రాప్స్, ల్యాండ్‌మైన్స్ , మందుపాతరలతో నక్సల్స్ విరుచుకుపడుతున్నారు. ఇటీవల వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు యేసు అనే స్థానికుడు బలయ్యాడు. తాజగా మరో ఘటనలో వెంకటాపురం మండలంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలి గిరిజన మహిళ తీవ్రంగా గాయపడింది. వరుస సంఘటనలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గిరిజనులు భయంగుప్పిట్లో బతుకుతున్నారు. మరోపక్క పోలీసులు భారీ సంఖ్యలో మందుపాతరలను, బూబీ ట్రాప్‌లను గుర్తిస్తుండటంతో ఏజెన్సీల్లోని పల్లెల్లో కలకలం చెలరేగుతోంది. పోలీసులు –మావోయిస్టుల మధ్య ఆధిపత్య పోరులో సామాన్యులు నలిగిపోతున్నారనే వాదన వినిపిస్తోంది.

### కొత్తకొత్త వ్యూహాలు..!

మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల వరుసగా జరిగిన ఎన్‌కౌంటర్లలో వందల సంఖ్యలో మావోయిస్టులు హతమయ్యారు. గ్రేహౌండ్స్ బలగాలు రేయింబవళ్లు సరిహద్దులను జల్లెడ పడుతున్నాయి. భద్రాద్రి జిల్లా చర్ల అడవులతోపాటు.. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాలు, కర్రెగుట్ట, కొంగాల అభయారణ్యాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఇరు రాష్ట్రాల మధ్య రోడ్డు మార్గాన్ని మినహాయిస్తే.. పోలీసులు నక్సల్స్ స్థావరాలను చేరాలంటే.. దట్టమైన అరణ్యాలను దాటివెళ్లాలి. ఈ మార్గాల్లో వచ్చే పోలీసులను మావోయిస్టులు టార్గెట్‌గా చేసుకున్నట్లు తెలుస్తోంది. దట్టమైన అడవిలో పెద్ద సంఖ్యలో మావోలు మందుపాతరలను అమర్చినట్లు పోలీసులు గుర్తించారు. గుట్టలను ఎక్కి, దిగే చోట బూబీ ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. కాలి అడుగుపడితే.. కొద్దిపాటి ఒత్తిడికే భారీ విస్పోటనం చెందేలా వందలు.. వేల సంఖ్యలో బాంబులను అమర్చినట్లు తెలుస్తోంది.

### వరుస ఘటనలతో హడల్..

వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు యేసు అనే స్థానికుడు బలైన ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనతో మాకు సంబంధంలేదని, పోలీసులే బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఇది మరవక ముందే తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇలాంటి మరో ఘటన చోటుచేసుకుంది. చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత అనే మహిళ కర్రిగుట్ట సమీపంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబును తొక్కడంతో ఆ బాంబు పేలి ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. ప్రస్తుతం భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కాలును వైద్యులు సర్జరీచేసి తొలగించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అడవిని జల్లెడ పడుతున్నారు. వరుసగా మావోయిస్టుల మందు పాతరలను వెలికితీసి నిర్వీర్యం చేస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. మావోయిస్టుల ఉనికే లేకుండా చేయడం కోసం పోలీసులు అస్త్రశస్త్రాలతో అడవులను జల్లెడ పడుతున్నారు. మరోవైపు పోలీసులను మట్టుపెట్టడం కోసం మావోయిస్టులు అమర్చిన బూబిట్రాప్స్ ఇప్పుడు జనం గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.



## ఆరుగురు మావోయిస్టుల అరెస్ట్

**ములుగు:** తెలంగాణ– ఛత్తీస్గడ్ సరిహద్దులో గల వెంకటాపురం మండలం తడపాల అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కి చెందిన వెంకటాపురం– వాజేడు ఏరియా కమిటీ, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన మావోయిస్టులు, మిలిషియా సభ్యులు కర్రెగుటలపై మందు పాతరలు అమరుస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు కూంబింగ్ చేస్తుండగా తడపాల గ్రామానికి వెళ్లే దారిలో మందుపాతరలు అమరుస్తున్న నక్సలైట్లు వాళ్లను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వెంబడించి ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులను పట్టుకొని వారి వద్ద నుండి ఒక డీబీబీఎల్ తుపాకి, నాలుగు కిట్ బ్యాగులు, రెండు వాకీటాకీలు, పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో వెంకటాపురం– వాజేడు ఏరియా కమిటీ డిప్యూటీ దళ కమాండర్ రీతాతో పాటు పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి, బెటాలియన్ సభ్యుడు సోడి విజయ్, కుడం మిలిషియా సభ్యులు దస్రు, సోడి ఉర్ర, మడకం భీమా ఉన్నారు.వీరందరినీ ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్‌కు తరలించారు. ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆరుగురు మావోయిస్టుల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడించారు.



## ఛతీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్..

### 8 మంది నక్సల్స్ హతం

**వరంగల్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరోసారి గట్టి దెబ్బ తగిలింది. శనివారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు హతంకాగా, ఓ భద్రతా సిబ్బంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు. నారాయణపుర్ జిల్లా అబుజ్‌మడ్ ప్రాంతంలో గత రెండు రోజుల నుంచి ఎన్‌కౌంటర్ జరుగుతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ చెప్పారు. నారాయణపుర్, కంకేర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన భద్రతా దళాలు యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపడుతున్న సమయంలో ఎదురు కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఇంకా కాల్పులు కొనసాగుతున్నట్లు చెప్పారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, 53 బెటాలియన్ ఐటీబీపీకి చెందిన దళాలు జూన్ 12వ తేదీన కూంబింగ్ ఆపరేషన్ మొదలుపెట్టిన సంగతి తెలిసిందే.




## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

### 20 మంది అధికారులకు స్థానచలనం

**హైదరాబాద్, జూన్ 15 (ప్రజాస్వరం):** తెలంగాణలో భారీస్థాయిలో ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. 20 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మళ్లీ ఆరు నెలల తరువాత ఇంతటి స్థాయిలో బదిలీలు చేపట్టింది ప్రభుత్వం. ఖమ్మం కలెక్టర్‌గా ముజామ్మిల్ ఖాన్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బాధావత్ సంతోష్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా సందీప్ కుమార్ జా, కరీంనగర్ కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది. కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్, జయశంకర్ కలెక్టర్‌గా రాహుల్ శర్మ, నారాయణ్‌పేట్ కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ నియామకం అయ్యారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా కోయ శ్రీ హర్ష, హన్మకొండ కలెక్టర్‌గా ప్రవీణ్య, జగిత్యాల కలెక్టర్‌గా సత్యప్రసాద్, మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా విజయేంద్ర, మంచిర్యాల కలెక్టర్‌గా కుమార్ దీపక్, వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్, నల్లగొండ కలెక్టర్‌గా నారాయణ రెడ్డి నియమితులయ్యారు. అదేవిధంగా వనపర్తి కలెక్టర్‌గా ఆదర్శ్ సురభి, సూర్యాపేట కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్, వరంగల్ కలెక్టర్‌గా ఎం సత్య శారదాదేవి, ములుగు కలెక్టర్‌గా దివాకర, నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా అభిలాష అభినవ్‌ను ప్రభుత్వం నియమించింది. కాగా, భద్రాద్రి కలెక్టర్ గా పనిచేసిన ప్రియాంక ఆల, భూపాలపల్లి కలెక్టర్‌గా పనిచేసిన భవేశ్ మిశ్రాలను ప్రభుత్వం బదిలీ చేసినప్పటికీ వీరికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.



## డిప్యూటీ సీఎంకు రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 15 (ప్రజాస్వరం):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భట్టి విక్రమార్కతో కలిసి తాను ఉన్న ఫొటోను ట్వీట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, ఆర్థిక, విద్యుత్ శాఖామాత్యులు భట్టివిక్రమార్క గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భగవంతుడు ఆయురారోగ్యాలు, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానం'టూ ట్వీట్ చేశారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. 'హృదయపూర్వక ధన్యవాదాలు సీఎం గారు... సదా కృతజ్ఞుడను' అని సీఎం ట్వీట్‌కు స్పందించారు. మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు సందర్భంగా మల్లు రవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా వ్యతిరేకత వల్లే ఎన్నికల్లో మోడీకి గుణపాఠం

### సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి

**హన్మకొండ, జూన్ 15 (ప్రజాస్వరం):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లనే లోక్ సభ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా స్థాయి సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులు ధర్మసాగర్ మండల కేంద్రంలో ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మోడీ పదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి భిన్నంగా పాలన జరిగిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను ఖూనీ చేశారని అన్నారు.

